


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 7-10-2024
సంపుటి: 20 సంచిక: 166
పేజీలు: 4 వెల: రూ.1

# బాలికపై వృద్ధుడు అఘాయిత్యం



## పోలీసుల అదుపులో నిందితుడు

(సత్యంన్యూస్, పాలకొండ)

భామిని మండలం తాలాడ గ్రామంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. తొమ్మిదేళ్ల బాలికపై గ్రామానికి చెందిన 69 ఏళ్ల కొత్తపల్లి చిన్నారావు అనే వృద్ధుడు అత్యాచారానికి పాల్పడినట్టు వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికను మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడినట్టు తెలిసింది. సదరు బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు బత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బత్తిలి ఎస్ఐ అనీల్ కుమార్ కేసు నమోదుచేసి నిందితుడు చిన్నారావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు.













# 'వదిలేయడం' కుదరదు



- మోజు తగ్గడానికి సవాలక్ష కారణాలు
- చివరి రోజు పెరిగే అవకాశం
- 2017-19 పాలసీతో పోలికుండదు
- ప్రభుత్వ ఆదాయానికి ధోకా లేదు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**జి**ల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వేయడానికి వీల్లేదని, అన్ని ప్రాంతాల్లోనూ తెలుగుతమ్ముళ్లే ఈ వ్యాపారం చేస్తారని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం వెనుక ఓ పెద్ద ఎత్తుగడే ఉంది. తెలుగుదేశం పార్టీకి మద్దతిచ్చే పత్రికల్లోనే ఇటువంటి కథనాలు రావడం గమనార్హం. ఒక దరఖాస్తుకు రూ.2లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ డీడీ తీయాలి. ఒక షాపునకు ఒక దరఖాస్తు వేస్తే వచ్చే పరిస్థితి లేదు. కనీసం 10 దరఖాస్తులైనా వేయాలి. తీరా షాపు లక్కీ డ్రాలో వస్తే, తెలుగుదేశంనేతలు వ్యాపారం చేసుకోనివ్వరనే సంకేతాలు పంపడం కోసమే ఈ కథనాలు ప్రచురితమవుతున్నాయి. యథావిధిగా వైకాపా అధికార గెజిట్ సాక్షి కూడా ఇదే ట్రాప్‌లో పడింది. దరఖాస్తు రుసుము ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరకూడదనేది సాక్షి ఉద్దేశం కావచ్చు. కానీ జాగ్రత్తగా ఆలోచిస్తే రాష్ట్రంలో రెండు మూడు చోట్ల తప్ప మరెక్కడా వైన్‌షాపులకు సంబంధించి దరఖాస్తు చేసుకోడానికి ఎక్కడా అభ్యంతరాలు వ్యక్తం కావడంలేదు. కేవలం చివరి రోజు వరకు వేచిచూసి దరఖాస్తులు వేయాలనే కోణంలో చాలామంది వ్యాపారులు ఉన్నారు.

### గతసారి వేలంవెర్రి ఇప్పుడుండదు

ఏదిఏమైనా 2017-19 మద్యం పాలసీలో పడినన్ని దరఖాస్తులు ఈసారి రాకపోవచ్చు. ఎందుకంటే.. నాన్ రిఫండబుల్ డీడీ రుసుమే - మిగతా 4లో

# కొన్నోడికి 'సలసల' అమ్మినోడికి సమ్మగా!



- ◆పాత స్టాకుకు కొత్తరేటు
- ◆విజిలెన్స్ పెడితే బండారం బయటకు
- ◆వారంలో కోట్లాది రూపాయలు లాభం
- ◆వంటనూనెలతో వ్యాపారుల ఆటలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశీయ మార్కెట్‌లో నూనెగింజల ధరలు క్షీణిస్తుండటంతో రైతులకు మద్దతు ధర కల్పించడం కోసం కేంద్ర మంత్రిమండలి తీసుకున్న ఒక నిర్ణయం జిల్లాలో నూనె వ్యాపారస్తులకు కాసులు కురిపిస్తోంది. ఇటీవల వంటనూనెల ధరలు భారీగా పెరిగాయని మనందరికీ తెలుసు. కానీ ధరలు పెంపుదలకు కారణమైన ప్రభుత్వ నిర్ణయం వెలువడక ముందు జిల్లాలో ఉన్న పాత స్టాక్‌ను కొత్త ధరలకు అమ్ముతూ వంటనూనెల డిస్ట్రిబ్యూటర్లు, హోల్‌సేల్ వ్యాపారస్తులు పెద్ద ఎత్తున సొమ్ములు చేసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో దసరా, దీపావళి ఉండటంతో సాధారణంగా నెలవారీ వాడకం కంటే ఎక్కువ నూనెను పండగ పూట వాడుతారు. దీనికి తోడు పాత స్టాకును కొత్త రేటుకు అమ్మడంతో నూనె వ్యాపారస్తులకు దసరా సంబరం ముందే వచ్చినట్టయింది. వివరాల్లోకి వెళితే.. మన దేశంలో నూనె గింజలు పండిస్తున్న రైతులకు సరైన ధర పలకడంలేదని కేంద్ర ప్రభుత్వం భావించింది. దీనికి తోడు హర్యానా, మహారాష్ట్ర వంటిచోట్ల ఎన్నికలు ఉండటంతో అక్కడి రైతులను ప్రసన్నం చేసుకోడానికి ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ ఆయిల్ల దిగుమతిపై 20 శాతం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ విధించింది. గతంలో దీనిమీద ఎటువంటి దిగుమతి సుంకం ఉండేదికాదు. దీనివల్ల విదేశాల్లో దొరికిన ముడినూనెను తక్కువ ధరకే కంపెనీలు తెచ్చుకుంటున్నాయని, స్థానికంగా రైతులు పండించిన నూనె గింజలను కొనడానికి ఇష్టపడటంలేదని భావించిన ప్రభుత్వం పది రోజుల క్రితం కేబినెట్ సమావేశం పెట్టి దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలపై సుంకాన్ని విధించింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి ఆయిల్‌ను ఇక్కడ కర్మాగారాల్లో శుద్ధి చేసి రిఫైండ్ ఆయిల్‌గా మనకు విక్రయిస్తున్నారు. దీని మీద గతంలో 12.5 శాతం టాక్స్ ఉండేది. దానిని 32.5 శాతానికి పెంచారు. దీని వల్ల దేశీయంగా పండుతున్న నూనెగింజలు కొంటారని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటి వరకు వంటనూనెల్లో 70 శాతం విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఇందులో పామాయిల్ వాటా 50 శాతం ఉండటం గమనార్హం. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటుండగా, అర్జంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అయితే ఇప్పుడు వీటి మీద టాక్స్‌లు విధించడం వల్ల రిటైల్ మార్కెట్‌లో 10 నుంచి 15 శాతం నూనె ధరలు పెరిగాయి. 108 రూపాయలు ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ రూ.124కు పెరిగింది. రూ.95 ఉన్న పామాయిల్ ప్యాకెట్ రూ.105కు మారింది. రూ.155 ఉన్న వేరుశనగ నూనె రూ.165కు ఎగబాకింది. అయితే ఇవన్నీ కొత్తగా టాక్స్‌లు విధించిన తర్వాత పెరిగిన రేట్లు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న రోజుకు, టాక్స్‌లు అమలులోకి వచ్చిననాటికి మధ్య నాలుగు రోజుల వ్యత్యాసం ఉంది. ఈలోగానే జిల్లా వ్యాప్తంగా ఆయిల్ డిస్ట్రిబ్యూటర్లు పాత రేటుతో ఉన్న స్టాక్‌ను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకున్నారు. జిల్లాలో ప్రతీ సందులోనూ ఇళ్లను అద్దెకు తీసుకొని వాటిని గొడౌన్లుగా మార్చేసి నూనె ప్యాకెట్లను నిల్వ ఉంచేశారు. ఇప్పుడు నూనె కోసం ఎవరు వెళ్లి అడిగినా, పాత ప్యాకెట్ మీదే కొత్త ధర వేసి అమ్ముతున్నారు. ఇష్టముంటే తీసుకోండి, కష్టమైతే మానేయండి అని పరోక్షంగా చెబుతున్నారు. మూడు ఆయిల్ ప్యాకెట్లు కావాలని అడిగితే ఒకటే ఉందని, తమ వద్ద స్టాకు లేదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. జిల్లాలో ప్రతీచోట రిఫైండ్ ఆయిల్‌కు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. వీరంతా పాత స్టాకునే కొత్త రేటుకు అమ్ముతున్నారు. ప్రతీరోజు నాలుగు లారీల స్టాకు క్రమం తప్పకుండా ఒక్కో డిస్ట్రిబ్యూటర్‌కు వస్తుంటాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన తర్వాత ఈ లారీల సంఖ్య మరింత పెరిగింది. జిల్లా విజిలెన్స్ అధికారులు గొడౌన్ల మీద రైడ్‌లు జరిపితే పాత స్టాకు ఎంతుందో బయటపడుతుంది.



# డీపీవో ఏవోపై కలెక్టర్ ఆగ్రహం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీపీవో పరిపాలన అధికారిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫరీద్‌పేటకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట అమ్మినాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై డీపీవో అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 జూలై 17న ఫరీద్‌పేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేయాలని అప్పటి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఇప్పటివరకు ఎందుకు ఇంప్లిమెంట్ చేయలేదని పంచాయతీ, జిల్లాపరిషత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 2018లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో సుమారు రూ.4లక్షలతో గ్రామంలో రెండు అభివృద్ధి పనులను మాజీ ఎంపీటీసీ కొత్తకోట అమ్మినాయుడు చేపట్టారు. అప్పటి ప్రభుత్వం ఈ రెండు పనులకు సంబంధించిన బిల్లులను పంచాయతీ ఖాతాలో జమ చేసింది. ఖాతాలో బిల్లు మొత్తం జమచేసినా సర్పంచ్ పూర్ణచంద్రరావు వాటిని ఉద్దేశపూర్వకంగా అమ్మినాయుడుకి చెల్లించలేదు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని విచారించిన హైకోర్టు సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌కు ఆదేశించింది. దీంతో హైకోర్టు ఆదేశాల మేరకు చెక్‌పవర్ రద్దు చేయాలని డీపీవోను కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆదేశాలు తక్షణం అమలుచేయాలని ఎచ్చెర్ల ఎంపీడీవోకు డీపీవో ఆదేశించారు. హైకోర్టు ఆదేశాలు అమలుచేయకుండా ఎంపీడీవో తొక్కిపెట్టి కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో బాధితుడు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కలెక్టర్ డీపీవోను వివరణ కోరినా సమాచారం ఇవ్వకపోవడంతో కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించి పరిష్కారం చూపించడంలో విఫలమవుతున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



## శ్రీశైల దేవస్థానంలో శ్రీలత నృత్యప్రదర్శన

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

దేశంలో ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆమదాలవలసకు చెందిన నాట్యశ్రీ నృత్యకళానికేతన్ వ్యవస్థాపకురాలు కూన శ్రీలత ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం నిర్వహించిన ఈ ధార్మిక సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీలత కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాసులు నృత్యసారధ్యంలో ఆదియోగి సాంస్కృతిక రూపకాన్ని ప్రదర్శించి నృత్యాభిమానుల ప్రశంసలు అందుకున్నారు.

● ఎడిటోరియల్

# ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు

నీతులు, ధర్మాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఏదైనా సరే ఇతరులకు చెప్పటానికి, బోధించటానికి ఉంటాయి. తాము ఆచరించటం ప్రారంభించగానే చాలా కష్టంగా మారతాయి. అందుకే మన సినీ కవి ఏనాడో చెప్పాడు 'ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి' అని. మనకో ఉటంకింపూ ఉంది. హరిదాసు, వారి కథా సందర్భంగా ఉల్లి తినడం వల్ల కలిగే అనర్థాలను ఏకరువు పెట్టి దానిని విసర్జించాలని చెప్పాడట. ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నపుడు భార్య ఉల్లి లేకుండా చేసిన పాకాన్నీ వడ్డిస్తే, ఇదేమిటీ? అని ప్రశ్నించి, ఓసి పిచ్చిదానా! ఉల్లి గురించి ప్రేక్షకులకు చెప్పానే కానీ, నాకు వద్దన్నానా? అని తిట్టి పారేశాడని చెప్పుకుంటాం మనం. అంటే చెప్పడానికి ఎన్నయినా చెబుతాం. అవన్నీ మన కోసం కాదని అర్థం. ఇప్పుడు నాయకుల మాటలు, బాబాలు, ప్రవచనకారులు మాట్లాడుతున్న మాటలు, బోధనలు విన్నపుడు హరిదాసు గుర్తుకు రాకమానరు. మాటలకు చేతలకు ఎక్కడా పొంతన లేకపోవడం అనేది మనల్ని పట్టి పీడిస్తున్న పెద్ద జాడ్యం. విన్నవన్నీ చాలా బాగా అనిపిస్తాయి. చెబుతున్న వాళ్లు గొప్పవాళ్లుగా కీర్తించబడతారు. కానీ అసలు ఆచరణకు వచ్చేసరికి చేతులెత్తేస్తారు. ఇదీ మన బోధకుల వరుస. ఒకసారి మహాత్మాగాంధీని వారి అనుచరులు ఇలా దీన్ని ఆచరించటం సాధ్యమవుతుందా? అని అడిగారట. అప్పుడు గాంధీ ఏమన్నారంటే, నేను పది రోజుల తర్వాత చెబుతానని చెప్పి తాను ఆ పదిరోజులు ఆచరించి సాధ్యమేనని తెలుసుకుని అడిగిన వారికి చెప్పారని ప్రతీతి. ఇప్పుడలా ఎవరున్నారు! మాటలు కోటలు దాటుతాయి. చేతలు గడపలు దాటవు అన్నట్లుగానే సాగుతున్నది. ఈ మధ్య మనం చాలా ఇష్టంగా సోషల్ మీడియాలో వింటున్న ప్రబోధాలు.. ముఖ్యంగా ఈష పౌండేషన్ అధినాయకుడు జగ్గీ వాసుదేవ్ ఆలోచనలూ, వివరణలు, బోధనలు చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. ఆయన తమిళనాడులో పెద్ద ఆశ్రమం, శిష్య బృందం, దాని నిర్వహణ చాలా పెద్ద వ్యవస్థనే ఉంటుంది. ధ్యాన్సులు, పాటలు, మాటలు, క్షేత్ర పర్యటనలూ, ప్రకృతి ఆస్వాదనలు, ఇన్నీ అన్నీ కావు, పెద్ద ఫాలోయింగ్ ఉన్న గురువర్యులు ఆయన. అయితే ఇటీవల ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ కామరాజు మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్‌ను వేసారు. అదేమంటే తన ఇద్దరు కుమార్తెలను ఈష పౌండేషన్ నుంచి విడిపించాలని హైకోర్టును కోరారు. ఈ కేసు విచారణను చేపట్టిన హైకోర్టు, సద్గురు జగ్గీ వాసుదేవ్ ఒక పక్క తన కుమార్తెకు చక్కగా పెళ్లి చేసి, జీవితంలో స్థిరపడేట్లు చేసి, మరోపక్క ఇతర యువతులను ఐహిక జీవితాన్ని వదిలి యోగా కేంద్రాల్లో సన్యాసినులుగా బతికే విధంగా ఎందుకు ప్రోత్సహిస్తున్నారని కోర్టు ప్రశ్నించింది. తన కూతుళ్లను ఫౌండేషన్ మాయలో పడేసి ఆశ్రమానికి బంధీలుగా చేశారని తండ్రి ఆవేదనకు కోర్టు జగ్గీని అలా ప్రశ్నించింది. 'ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నామని భావిస్తున్న మీకు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం పాపంగా కనపడటంలేదా?' అని ధర్మాసనం ఆ ఇద్దరు కుమార్తెలనూ ప్రశ్నించింది. ఇదీ మన 'సద్గురు' ఆచరణ! విచారణ చేస్తున్నా చివరికి కోర్టు ఏం చేస్తుంది అనేది. ఆయన ప్రభావ పలుకుబడిల మీద ఎలా పరిణమిస్తుందనేది వేరే విషయం. ఇక్కడే ఇంకో ప్రస్థావన చూడవచ్చు. ఈ మధ్య ఆంధ్ర ప్రదేశ్‌లో సనాతన ధర్మాచరణ కోసం బయలుదేరిన పవన్‌కళ్యాణ్ మాటలే ఎలా మారాయో గమనించవచ్చు. 'నేను బలమైన సనాతన ధర్మాన్ని ఆచరించే వాడిని, దాన్ని కాపాడటానికి కృషి చేస్తాను' అని ప్రకటించాడు. అంతకు ముందు ఓ ఇంటర్వ్యూలో ఇదే పవన్ 'గోమాంసం గురించి ఇపుడు ఇంత గొడవ జరుగుతోంది. నాకు ఆకలి వేసి, వేరే దారి లేకపోతే, బీఫ్ తినాల్సి వస్తే తిని ముందుకు పోతాను' అని కుండబద్దలు కొట్టారు. మన చాగంటివారు చేసిన ఒక బోధనలో ఏమన్నారంటే, 'భార్యకు విడాకులు ఇవ్వటం, దంపతులు విడిపోవటం అనే మాట సనాతన ధర్మంలో లేనేలేదని చెప్పారు. ఒకవేళ పొరపాట్లు ఏమైనా చేసినా ఉద్ధరించి మళ్లీ తన పక్కకు తెచ్చుకోవడమే చేయాలి గౌతమునిలా' అని ప్రవచించారు. ఇది ఆయనకు వర్తిస్తుందా? అని మాత్రం ప్రశ్నించకండి. నిజంగా ధర్మాన్ని ఆచరించాలని వీరికి ఉందా? సనాతన ధర్మం అనే ఒక భావాన్ని పట్టుకుని రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవటం తప్పు. సమధర్మ పాటింపే నేటి కాల ధర్మము. అందరినీ సమంగా చూడాలనేదే అందరూ పాటించాల్సిన ధర్మం. శాశ్వతమైన నీతులు, ధర్మాలు, ఆచరణలు ఉండవు. కాలాన్ని బట్టి ఆచారాలు, నీతులు మారతాయి. అట్లాంటిది, తిరిగి వెనక్కి వెళతామని ఎవరు చెప్పినా అది వాస్తవం కాదని అర్థం చేసుకావాలి. ఎదుటి వాళ్లకు చెప్పటానికే అన్ని విషయాలూ ఉన్నాయని సద్గురులు నిరూపించారు. ఆ అపర సనాతన ధర్మాలూ నిరూపిస్తున్నాయి. వినేవాళ్లంగా మనమంతా అప్రమత్తంగా ఉండాలి మరి!

## పటిష్ట నిఘా ఉంచాలి



(సత్యంన్యూస్, రణస్థలం)

పైడిభీమవరం వద్ద పటిష్ట నిఘా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పైడిభీమవరం వద్ద ఉన్న చెక్‌పోస్టును కలెక్టర్‌తో పాటు ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు పాక్షికంగా ఒక షెడ్ వేయాలని, అక్కడ లైటింగ్ తక్కువగా ఉందని మరింత లైటింగ్ పెంచాలని ఆదేశించారు. వాహనాలు ఆపేందుకు స్టాపర్ ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బందిని పెంచి బలోపేతం చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద మౌలిక సదుపాయాలు పెంచాలన్నారు. ఈ తనిఖీలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష, సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

## ఒకేషనల్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేక దృష్టి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వృత్తివిద్యను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవచ్చని జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి (జీసీడీవో) డాక్టర్ కాలేషా బేగం అన్నారు. ఎస్‌కే పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య ఇంటర్న్ షిప్‌కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అందం, ఆరోగ్యంకు సంబంధించి 10 మంది విద్యార్థులను స్థానిక బ్యూటీ పార్లర్ షాపులో శిక్షణకు పంపించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాత సామగ్రి పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రిషికేశ్, ఒకేషనల్ శిక్షకులు ఎస్.ద్రాక్షాయణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి, విశాఖ ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ పాఠశాల సమన్వయ అధికారి రూపవతి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రత్నవల్లి ఎంతగానో సహకరించారు.



హర్షవల్లి లయన్స్‌క్లబ్‌కు

## అవార్డుల పంట

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

శ్రీకాకుళంలో విశిష్ట సేవలందిస్తున్నందుకు హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు ఆదివారం రాత్రి గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగిన 316ఏ లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ వేడుకల్లో ఏడు అవార్డుల దక్కాయి. హర్షవల్లి లయన్స్ సేవలు హర్షణీయమని 316ఏ లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ ఏ.గోపాలరావు అన్నారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలిగా, జోన్ చైర్మన్‌గా లయన్ కరణం శోభారాణికి రెండు అవార్డులు, ప్రస్తుత అధ్యక్షుడు లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడుకు, విద్యా సంక్షేమ చైర్మన్ లయన్ హారికా ప్రసాద్‌కు, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగ జిల్లా చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కోశాధికారి, ఉపాధ్యక్షుడుగా లయన్ తర్లాడ అప్పలనాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి కుమార్ రాజు, గత గవర్నర్లు, ఇతర ప్రతినిధులు, అన్ని లయన్స్‌క్లబ్‌ల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునీకరిస్తాం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామని కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని శ్రీకాకుళం వన్ డిపో పరిధిలో ఐదు కొత్త బస్సులను కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సౌకర్యార్థం మరో 1500 నుంచి 2వేల బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. సోలార్, ఎలక్ట్రిక్ బస్సులను కూడా నడిపించేందుకు చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సంబంధించి సమస్యలను ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారని, వర్షం కురిసిన సమయంలో నీరంతా కాంప్లెక్స్ ఆవరణలోనే నిలిచిపోతోందని, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ఏడేళ్లుగా జిల్లా ప్రజలకు అవకాశం లేకుండాపోయిన శ్రీకాకుళం టు విజయవాడ ఇంద్ర బస్సును మరలా పునరుద్ధరించామన్నారు. శ్రీకాకుళం 1,2 డిపోల పరిధిలో 11 బస్సులను కొత్తగా రన్నింగ్‌లోకి తెచ్చామని, త్వరలో మరో 30 బస్సులు రావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా 1వ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్, 1,2 డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్తునికి రూ.7వేలు సాయం

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన దళాయి లింగరాజు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఆయనకు సాయమందించింది. ఈమేరకు ఆదివారం ఆయనకు రూ.7వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సావాడ గణేష్ రెడ్డి, నీలాపు దుర్యోధన, దక్కత శంకర్, మద్ది త్రినాధ్, పనపాన రవి, తిప్పనపుట్టుగ గ్రామస్తులు పాల్గొన్నారు.



## జాతీయ అవార్డులకు క్లీన్‌చిట్ సర్టిఫికెట్ ఉండాలేమో?






జానీమాస్టర్‌కి ఇచ్చిన జాతీయ అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నేషనల్ ఫిల్మ్ అవార్డు సెల్ ప్రకటించింది. జానీ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో జానీ మాస్టర్ నిర్దోషిగా బయటకు వస్తే అప్పుడు యథాతథంగా జానీమాస్టర్‌కు అందజేశారు. ఇదీ సంగతి. అయితే వృత్తిగత జీవితానికి, వ్యక్తిగత జీవితానికీ మధ్య లింకేంటన్నది చాలామంది ప్రశ్నిస్తున్నారు. జానీ బెస్ట్ డ్యాన్స్‌మాస్టర్ అవునా కాదా అనేది ఓ కమిటీ నిర్ణయించింది. అవార్డు ప్రకటించింది. మధ్యలో ఈ కేసు గొడవ బయటకు వచ్చింది. ఒకవేళ అప్పటికే జానీమాస్టర్‌కు అవార్డు ఇచ్చేస్తే, ఆ తరువాత కేసు సంగతి బయటకు వస్తే అప్పుడు అవార్డు వెనక్కు తీసుకునేవారా? అలా ఇప్పటివరకూ ఎవరి అవార్డులనైనా జాతీయ అవార్డు కమిటీ వెనక్కు తీసుకోగలిగిందా? ఇక మీదట జాతీయ అవార్డులకు నామినేషన్లు పంపేటపుడు క్లీన్‌చిట్ పత్రాలు జత చేయాలా? ఆ అవసరాన్ని ఇప్పుడు జాతీయ అవార్డు కమిటీ కల్పించిందా? ఇవన్నీ ఇప్పుడు ఉదయిస్తున్న ప్రశ్నలు. ఓ సినిమావాడ్ని ఎవరైనా ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఈజీగా టార్గెట్ చేయగలరు. కార్నర్ చేసేయగలరు. అందుకు జానీ ఉదంతమే నిదర్శనం. జాతీయ అవార్డు కోసం జానీ ఎంత కష్టపడి ఉంటాడు? సరే.. వచ్చింది.. ఇప్పుడు ఓ కేసులో ఇరుక్కున్నాడు. కాబట్టి అవార్డుపై స్టే ఇచ్చారు. నిర్దోషి అని తేలితే అప్పుడేం చేస్తారు? అప్పుడు మళ్లీ అవార్డు ఇస్తాం.. వచ్చేయ్.. అంటే ఇప్పటి కళ, ఇప్పటి గౌరవం అప్పుడు ఉంటుందా? అవార్డు అందుకోవడానికి ఇంతే సంతోషంగా జానీ మాస్టర్ వెళ్లగలడా? ఎన్నికల్లో గెలిచిన నాయకులకు ఈ ఆప్షన్ ఎందుకు లేదు? వాళ్లపై కేసు నమోదైతే, కోర్టుల చుట్టూ తిరుగుతుంటే, నిజాయితీ నిరూపించుకున్న తరువాతే పదవుల్లోకి రండి, ప్రజల్ని ఏలండి.. అని ఎందుకు చెప్పలేకపోతున్నారు? అంటే సినిమావాళ్లకు ఓ రూలు, రాజకీయాలకు మరో రూలా? ఇదెక్కడి న్యాయం?!

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## హాట్ బ్యూటీ ఘాటు ఫోజులు!


బాలీవుడ్ హాట్ బ్యూటీ శామా సికిందర్ ఇన్‌స్టా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నిత్యం డిజైనర్ దుస్తుల్లో శామా సెగలు నెట్టింట చర్చకొస్తుంటాయి. ఎలివేషన్‌లో తనదైన మార్క్ తప్పనిసరి ఎన్నోసార్లు ప్రూవ్ చేసింది. హీటెక్కించే ఘాటు ఫోజులతో కుర్రకారుని అలరించడం అమ్మడి ప్రత్యేకత. డిజైనర్ దుస్తులేసినా.. సంప్రదాయ దుస్తులైనా షామా అందానికి కుర్రాళ్లంతా ఫిదా అవ్వాల్సిందే. మార్కెట్‌లో పోటీని తట్టుకుని నిలవాలంటే? ఆ మాత్రం తప్పదంటూ ముందుకు సాగిపోతుంది. తాజాగా మరోసారి వెకేషన్‌లో భాగంగా హాట్ ఫోటోలతో నెట్టింట్లో చర్చ మొదలు పెట్టింది. ఇదిగో ఇక్కడిలా టూపీస్ దుస్తుల్లో అగ్గిరాజేస్తుంది. గ్రీన్ కలర్ పీస్ లో అమ్మడు అందాల్ని హైలైట్ చేస్తూ కెమెరాకి ఫోజులిచ్చింది. అది నడుము లోతు నీటిలో జలకాలాటలు అడుతూ కుర్ర కారును కవ్విస్తూ. స్వచ్ఛమైన నీటిలో అమ్మడు అంతే స్వచ్ఛంగా సేదతీరుతూ తనలో బ్యూటీని ప్రోజెక్ట్ చేస్తుంది. టాప్ టూ బాటమ్ తో పాటు కొన్ని క్లోజప్ షాట్స్ లో తగ్గేదేంలే! అని ప్రూవ్ చేసింది. ప్రస్తుతం ఈఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ పిక్‌ని ఉద్దేశించి ఓ కొటేషన్ ఇచ్చిదండోయ్. "ఈ క్షణానికి నన్ను తిరిగి తీసుకువెళ్లండి. నా చర్మంపై సూర్యుడు, నా పాదాల వద్ద సముద్రం. ఎంతో ఆహ్లాదంగా ఉంది. వెకేషన్ రీసెట్ ఎవరికి అవసరం?" అంటూ రాసుకొచ్చింది. ఇక షామా కెరీర్ సంగతి చూస్తే "ప్రేమ్ అగాన్" సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత "మన్".. "ది డెట్లీ పార్ట్".. బస్తీ, దూమ్ ధడాకా, కాంట్రాక్ట్, సెక్సాహోలిక్ లాంటి సినిమాల్లో నటించింది. బ్యూటీ చివరి సారిగా నటించిన బైపాస్‌రోడ్ రిలీజ్ అయి మూడేళ్లు అవుతుంది. అప్పటి నుంచి కొత్త అవకాశాలేవి అందుకోలేదు.



– తుపాకి.కామ్ సౌజన్యంతో...

రజనీకాంత్..మణిరత్నం..

## ఓ పొలిటికల్ డ్రామా



స్టార్ల కంటే కథకు ప్రాధాన్యం ఉన్న దర్శకుడు మణిరత్నం. పెద్దహీరోల డేట్ల కోసం ఎదురుచూడడం ఆయనకు ఇష్టం ఉండదు. అందుబాటులో ఎవరుంటే వాళ్లతో సినిమా నడిపించేస్తారు. అవసరమైతే కొత్త నటీనటుల్ని వెదికిపట్టుకుని వాళ్లకు నగిషీలు చెక్కుతారు. అయితే ఎందుకో మణిరత్నం ఈమధ్య స్టార్‌హీరోల వైపు దృష్టి మరల్చారనిపిస్తోంది. 'నాయకుడు' తరువాత ఇంతకాలానికి కమల్‌హాసన్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఆ సినిమా సెట్స్ పై ఉంది. ఇప్పుడు రజనీకాంత్‌తో ఓ సినిమా చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటారన్నది చెన్నై వర్గాల టాక్. రజనీకాంత్‌తో 'దళపతి' తరువాత మణిరత్నం మళ్లీ పని చేయలేదు. దాదాపు 30 ఏళ్ల తరువాత ఈ కాంబోని మళ్లీ చూసే అవకాశం దక్కబోతోంది.

ఇటీవల రజనీకాంత్, మణిరత్నం మధ్య కథకు సంబంధించిన చర్చలు జరిగాయని, ఈసినిమాలో నటించడానికి రజనీ తన అంగీకారం తెలిపారని టాక్. ఇదో పొలిటికల్ డ్రామా అని, నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ కథని మణిరత్నం రూపొందించారని తెలుస్తోంది. మణిరత్నం పొలిటికల్ డ్రామా తీసి చాలా కాలం అయ్యింది. రజనీ కూడా ఆ తరహా కథలో నటించి చాలా కాలమైంది. తమిళనాడు రాజకీయాలను కుదిపేసే ఓ అంశం ఈ కథలో ఉండబోతోందని సమాచారం అందుతోంది. రజనీకాంత్ ప్రస్తుతం వెట్టయాన్ చిత్రాన్ని పూర్తి చేశారు. ఈ దసరాకు విడుదల కానుంది. 'కూలీ' చిత్రీకరణ జరుపుకుంటోంది. 'జైలర్-2' కథ కూడా తయారవుతోంది. మరో రెండు కొత్త సినిమాలకు సంతకాలు చేశారని తెలుస్తోంది. వీటిమధ్య మణిరత్నం చిత్రానికి ఎప్పుడు డేట్లు ఇస్తారో చూడాలి.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



# తాళాలతో మొదలుపెట్టి..

ఏ మధ్య తరగతి ఇంటి తలుపు తట్టినా.. ఆ ఇళ్లల్లో కనిపించే వస్తువుల్లో ఓ అల్మరా మనకు దర్శనమిస్తుంది. గేజుల కొలతల్లో భాగంగా ఎవరైనా స్థానికంగా చేయించుకున్నవి మినహా మనకు కనిపించే ఆ బీరువాలపై రాసుండే పేరు గోద్రేజ్. మరి ఓ చిన్న షెడ్ నుంచి తన వ్యాపారాన్ని ప్రారంభించి.. తన వ్యాపారాన్ని బహుళజాతి సామ్రాజ్యంగా విస్తరించేందుకు ఆ ఆర్దేషిర్ బుర్జోర్జీ సొరాబ్జీ గోద్రేజ్ తన స్వహస్తాలతో రాసిన తన విజయగాధేంటో తెలుసుకుందాం పదండి.

# అల్మారాలపై బ్రాండ్ నేమ్ అయ్యాడు!!



భారత్‌కు స్వాతంత్ర్యం రాకముందే ప్రారంభమై ఇళ్లల్లో దర్శనమిచ్చిన బ్రాండ్ గోద్రేజ్. ప్రారంభంలో ఉన్నత వర్గాలవారు మాత్రమే ఉపయోగించే గోద్రేజ్.. ఆ తర్వాత మధ్య తరగతి కుటుంబాలకూ వచ్చి చేరింది. రవీంద్రనాథ్ ఠాగూర్, అనీబిసెంట్ వంటివారి పూర్తిస్థాయి సహకారంతో నాడు వేళ్లూనుకుని వారి మనన్ననలు పొందింది గోద్రేజ్. ఇంగ్లాండ్ రాణి 1921లో భారత్ పర్యటించినప్పుడు కూడా ఆమె తన పర్యటనలో వార్డ్ రోబ్‌గా గోద్రెజ్ బీరువానే వాడారట.


బ్రిటీషర్స్ కాలంలో ఇంగ్లండ్ నుంచి దిగుమతి చేసుకున్న తాళాల కంటే మెరుగైన తాళాలను తయారు చేయడంతో గోద్రెజ్ తాళాలకు మొదట డిమాండ్ ఏర్పడింది. విదేశాల నుంచి భద్రత కోసం దిగుమతి చేసే తాళాలు తరచూ పగిలిపోతుండటం, లోపలి ఇంటిగ్రేటెడ్ స్ప్రింగ్ సిస్టమ్ సరిగ్గా లేకపోవడాన్ని గమనించిన ఆర్దేషిర్ గోద్రెజ్ 1897 మే 7న ఓ షెడ్డులో తాళాల తయారీ ప్రారంభించాడు. అలా విదేశాల నుంచి దిగుమతైన తాళాల కంటే బందోబస్తుగా, చవకగా తాళాలను తయారుచేసి ఇండియన్ మార్కెట్‌లో తనకంటూ ఓ గుర్తింపు సాధించారు. అంతేకాదు మొట్టమొదట భారత్‌లో జరిగిన ఎన్నికల్లోనూ గోద్రెజ్ గ్రూప్ తయారుచేసిన బ్యాలెట్ బాక్సులనే వాడారంటే ఆ గ్రూప్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై ఎంత నమ్మకముండాలి..? తాళాల తయారీతో మొదలైన గోద్రెజ్ ప్రయాణం టైప్ రైటర్స్ మీదుగా ఆ తర్వాత ఎలా విస్తరించిందో, మిగిలింది ఇప్పుడు మనం కళ్లారా చూస్తూనే ఉన్నాం.

అయితే, మన ఇళ్లల్లో అల్మారాలపై తన పేరు రాసుకోవడంతో పాటు తన జీవిత తలరాతను కూడా తానే సృజనాత్మకత, శ్రమను జోడించి రాసుకున్న ఆర్దేషిర్‌ను.. తన జీవితంలో ఎదురైన ఓ అనూహ్య ఘటన మాత్రం విషాదంలో ముంచెత్తింది. ముంబైలోని 85 మీటర్ల ఎత్తులో కనిపించే ది గ్రేట్ రాజాబాయి టవర్ పైకెక్కిన ఆర్ధేషిర్ గోద్రెజ్ భార్య బచుబాయితో పాటు ఆయన కజినైన ఫిరోజ్ బాయి కిందపడి చనిపోవడం గోద్రెజ్ కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఓ ఇద్దరు అగంతకుల ఆగడాలతోనే ఆ ఇద్దరూ దూకి ఆత్మహత్య చేసుకున్నట్టుగా కూడా చెబుతుంటారు. అయితే, ఇప్పటికీ రాజాబాయి టవర్స్ పైనుంచి కిందపడి చనిపోయిన గోద్రెజ్ భార్య బచుబాయి, కజిన్ ఫిరోజ్ బాయిది ఆత్మహత్యా, హత్యా, ప్రమాదమా అన్నది వీడని మిస్టరీగా మిగిలిపోయి రాజాబాయి టవర్ ట్రాజెడీని ఇంకా చెప్పుకుంటూనే ఉన్నారు.

1868లో ముంబైలోని పార్సీ కుటుంబంలో పుట్టిన ఆర్దేషిర్ గోద్రెజ్ భారత్‌లో మొట్టమొదట కెమిస్ట్ షాప్‌లో అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఆ తర్వాత ఆర్దేషిర్ తన స్నేహితుడి తండ్రి మెర్వాన్జీ కామా అనే పార్సీ వ్యాపారవేత్తను కలవడంతో.. తన కొడుకు మాట మేరకు ఆర్దేషిర్‌కు వ్యాపారం కోసం రుణసాయం చేశారు మెర్వాన్జీ. మరి మీ నాన్నగారే బాగా డబ్బున్నవారు కదా.. ఆయన్నే ఎందుకు డబ్బడగలేదనే ప్రశ్నా మెర్వాన్జీ నుంచి గోద్రెజ్‌కు ఎదురైంది. తండ్రి ఇస్తే అది బహుమతవుతుంది.. సో, ఛాలెంజింగ్‌గా ఉండదు.. మీ దగ్గరైతే రుణంగా తీసుకోవచ్చు.. దాన్ని తీర్చాల్సిన బాధ్యత నన్ను ఎప్పటికప్పుడూ తరుముతుంటుంది, గుర్తు చేస్తుంటుందన్న గోద్రెజ్ సమాధానంతో మెర్వాన్జీ మాట్లాడకుండా ఆ రుణాన్నిచ్చేశారట. అదిగో అలా ప్రారంభమైంది గోద్రెజ్ తాళాల వ్యాపారం.

## గాంధీ సిద్ధాంతాన్ని నమ్మిన గోద్రెజ్!

ఆర్దేషిర్ గోద్రెజ్.. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అమితంగా ప్రభావితమైనవాడు. సత్యాన్ని నమ్మినవాడు. 1894 లోనే తన న్యాయవాద చదువును పూర్తిచేసి కొన్ని కేసులు వాదిస్తున్న సమయంలో తన స్వభావానికి ఎదురైన విరుద్ధ భావనలతో మొత్తంగా న్యాయవాద వృత్తికే స్వస్తి పలికాడు. బూర్జోర్జీ గూతేరాజీ అన్న ఇంటి పేరును తన తండ్రి గోద్రెజ్‌గా మార్చడంతో తన మూడేళ్ల వయస్సు నుంచే ఆర్దేషిర్ ఇంటిపేరు గోద్రెజ్ గానే ప్రాచుర్యంలోకొచ్చింది. 1894లో బాంబే సొలిసిటర్స్ అనే సంస్థ తమ కేసును వాదించడానికి ఆర్దేషిర్‌ను నియమించుకుని జాంజిబార్‌కు వెళ్లాలని కోరింది. కానీ, ఆ కేసులో వాస్తవాలను ఫ్యాబ్రి కేట్ చేసే అవసరముండటం, సత్యాన్ని మార్చి చెప్పాల్సిన పరిస్థితులు ఎదురవ్వడంతో ఆ కేసు నుంచి వైదొలిగాడు ఆర్దేషిర్. ఈ విషయాన్ని పీటర్ చర్చ్ బుక్ ప్రొఫైల్స్ ఇన్ ఎంటర్ ప్రైజ్ అనే పుస్తకంలో భారత వ్యాపారుల స్ఫూర్తిదాయక కథగా అభివర్ణించారంటేనే ఆర్దేషిర్ గోద్రెజ్ ఎంత నీతిమంతుడో చెప్పొచ్చు. గోద్రెజ్ కంపెనీల్లో ఇప్పుడు వేలమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. గోద్రెజ్ సోప్స్ నుంచి మొదలుకుంటే.. ఇవాళ అంతరిక్ష కార్యక్రమాలకు కూడా గోద్రెజ్ కంపెనీ ఇంజన్సే ఇంధనంలా పని చేస్తున్నాయంటే.. ఆ సంస్థ వ్యాపార రంగంలో సాధించిన హైట్స్ అంతరిక్షాన్ని తాకుతున్న ఎత్తంత అని మళ్లీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. మొత్తంగా తాళాల నుంచి మొదలైన గోద్రెజ్ వ్యాపార ప్రస్థానం సామాన్య, మధ్య, ధనికులన్న తేడా లేకుండా ఎందరి జీవితాలతోనో ఏదో ఓ విధంగా ముడిపడి భారతీయ దిగ్గజ వ్యాపార సంస్థగా ఎదగడమే ఈ 'ది గ్రేట్ ఆర్దేషిర్ గోద్రెజ సక్సెస్ స్టోరీ'.




## గ్రంథాలయంలో దసరా పద్యాలు

(సత్యంన్యూస్,లావేరు )

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో దసరా పద్యాల విశిష్టతను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలియచేశారు. ఐదు దశాబ్దాల క్రితం ఉపాధ్యాయులు దసరా సెలవుల్లో రంగుల బాణాలు చేతులో పట్టుకొని విద్యార్థులు పద్యాలు పాడుతూ ఇంటింటికీ వెళ్లేవారన్నారు. దసరా పద్యాలు కాలగమనంలో కొట్టుకుపోయాయన్నారు. విద్యార్థులంతా సెల్‌ఫోన్‌లకే పరిమితమైపోయారన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులతో దసరా పద్యాలను పాడించారు. అనంతరం శాఖా గ్రంథాలయంలో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగిన కిషోర్‌కుమార్ విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులను వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



## ఎక్సలెన్స్ అవార్డులతో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ 2023-24లో చేపట్టిన నిర్విరామ సేవలను గుర్తిస్తూ ఉత్తమ సేవలందించిన అధ్యక్షులు పొన్నాడ. రవికుమార్, మెంటర్ నటుకులమోహన్, జోన్ చైర్మన్ బాడాన దేవభూషన్‌తో పాటు క్లబ్ చేపట్టిన సేవలకు వివిధ విభాగా ల్లో 5అవార్డులతో కలిపి మొత్తం 8అవార్డులు దక్కించుకున్నారు. విశాఖలో జరిగిన లయన్స్‌క్లబ్ కేబినెట్ సమూహంలో లయన్స్‌క్లబ్ 16-ఎ గవర్నర్ ద్వారా అవార్డులను అందుకున్నారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ 2019నుంచి శ్రీకాకుళంలో లయన్స్‌క్లబ్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. గతేడాది క్లబ్ చేసిన సేవలకు, సమాజానికి, యువతకు, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో మైలురాయిని చేరుకున్నామన్నారు. లయన్స్‌క్లబ్ తరుపున ఇన్ని విజయవంతమైన కార్యక్రమాలను నిర్వహంచడానికి అందరి భాగస్వామ్యమేనన్నారు. ఇదే స్ఫూర్తితో సేవలను కొనసాగిస్తామన్నారు. అవార్డు అందుకున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులకు నగరంలో పలువురు ప్రముఖులు, వక్తలు అభినందించి సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.

## జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు హారిక

(సత్యంన్యూస్, నరసన్నపేట)



స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థిని బెవర హారిక జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న 37వ రాష్ట్ర అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, లాంగ్ జంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన హారికను కళాశాల ప్రిన్సిపాల్ ఈ.ఎం.నాయుడు, అకడమిక్ ఇన్‌చార్జ్ ముకల్ల శ్రీనివాస్, ఏఓ మెండ మోహన్‌దాస్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత నెలలో విజయవాడలో ముంపుకు గురైన రాజీవ్‌నగర్, పైపుల్ రోడ్డు, కృష్ణలంక ప్రాంతాల్లో వరద బాధితులకు బ్రదర్ మహిమాకర్ సహకారంతో ఏపీపీటీడీ ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు సహాయంతో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.ముత్యాలరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్‌నాయక్, రాష్ట్ర నాయకులు గజపతి, గంగాంజనేయులు, సుధీర్, మధుసూదనరావు, హరిప్రసాద్, జిల్లాల అధ్యక్షులు దాసరి కిరణ్, విజయ్, గౌరీశంకర్, అనిల్, నవీన్, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## వీడియో జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మరణించిన వీడియో జర్నలిస్టు గుణ కుటుంబానికి ఏపీయూడబ్ల్యుజే, అనుబంధ సంఘాల తరుపున రూ.61,500ను ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు సోమవారం ఉదయం అందించారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రూ.51,500 అందించగా, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు దివంగత గుణ కుటుంబానికి నివాళులర్పిస్తూ ఆయన భార్యకు ప్రభుత్వ విభాగంలో ఏదైనా ఉపాధి కల్పించాలని కోరూత ఎమ్మెల్యే గొండు శంకర్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎన్.ఈశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలకృష్ణ, మొదలవలస వాసు, రాష్ట్ర నాయకులు వి.ఎస్.నాయుడు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎస్.నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security. Digital Marketing. Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్ బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

## ఈనెల 18 నుండి నాటక పోటీలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీసుమిత్ర కళాసమితి, సూత్రాఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా నాటక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ నాటక పోటీలు ఉంటాయన్నారు. వీటిని స్థానిక బాపూజీ కళామందిరంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గుత్తు చిన్నారావు, నక్క హరి సత్యనారాయణ, మండవల్లి రవి, ప్రధాన విజయరాం, బిఎంఎస్ పట్నాయక్, నక్క శంకరరావు, సంగీత వరలక్ష్మి, జ్యోతి, పూజ తదితరులు పాల్గొన్నారు.



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తమ్మినాయుడు పేటలో అమ్మా సంస్థాన్ ఆలయంలో సోమవారం ఛండీయాగాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తంగి రాజు దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సాగి శ్రీనివాస రాజువర్మ తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, ఎచ్చెర్ల

## దేవీ ఆలయంలో కుంకుమ పూజలు

(సత్యంన్యూస్,ఎచ్చెర్ల)

మండలంలోని కుంచాల కురమయ్య పేటలోని శ్రీ దుర్గాదేవి ఆలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా సోమవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు లలిత దేవి అవతారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త బచ్చు నరసింహా రెడ్డి పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు భాల భాస్కర్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



# వాకర్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వాకర్స్‌క్లబ్‌ను విస్తరించి ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్-102 జిల్లా గవర్నర్ జె.నారాయణస్వామి అన్నారు. మహాత్మాగాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో ఆదివారం నిర్వహించిన వాకర్స్-102 గవర్నర్స్ మూడో క్యాబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వాకర్స్‌క్లబ్ విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఈనెల 27న పార్వతీపురంలో జరుగనున్న వాకర్స్ కాన్ఫెరెన్స్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించామని, సీనియర్ల సూచనలు మేరకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ గవర్నర్లు కర్రోతు సత్యం, ఇందిరాప్రసాద్, పి.జి. గుప్తా, కూన వెంకటరమణమూర్తి, వాకర్స్ 102 ప్రతినిధులు ఏరియా కో-ఆర్డినేటర్ జి.కృష్ణంరాజు, ఎస్.ఎస్.రాజు, కె.ఎర్రునాయుడు, గజిల్స్ గాయకుడు మంతిన వాసుదేవాచారి, ప్రొఫెసర్ కామరాజు, ఎస్.జోగినాయుడు, వివిధ క్లబ్ ప్రతినిధులు ఎం.ఎస్.ఆర్.మూర్తి, జగదీష్, దేవీప్రసాద్, కొండలరావు, పూజారి మన్మధరావు, సుధాకర్, వి.వివేకానంద, పొట్నూరు నాగేశ్వరరావు, పంచాది నారాయణమూర్తి, లక్ష్మీ, యోగా గురువు మురళీకృష్ణ, వివిధ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధిపై పౌరసమాజం స్పందించాలి



(సత్యంన్యూస్,పలాస)

ఉద్దానంలో కిడ్నీ వ్యాధి నివారణకు, శాశ్వత పరిష్కారం కోసం పౌర సమాజం స్పందించి పాలకులను నిలదీయాలని, కవులూ రచయితలు, గాయకులంతా సంఘటితమై తమ కలాలు, గళాలతో ప్రజల్లో పోరాట చైతన్యాన్ని రగిలించాలని ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఎస్. చలం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి తెలుగు భాష,జానపద కళాపీఠం, కళింగసీమ సాహిత్య సంస్థ సంయుక్తంగా నిర్వహించిన "ఉద్దానం కిడ్నీ విషాదాలు" పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ చలం ముఖ్య అతిథిగా పాలొన్నారు. దశాబ్దాలుగా ఉద్దాన ప్రాంత ప్రజలను కబలిస్తూ, వందలాది మంది ప్రజల ప్రాణాలను హరిస్తున్న కిడ్నీ వ్యాధిపై పలువురు కవులు, రచయితలు, సామాజికవేత్తలు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు, పాత్రికేయులు సాగించిన సమరానికి అక్షరూపాన్నిస్తూ రెండు సాహిత్య సంస్థలు సంయుక్తంగా ప్రచురించిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్దానంలో వేలాది ప్రాణాలను బలి తీసుకుంటున్న కిడ్నీ వ్యాధి నిర్మూలనకు అధికార, ప్రతిపక్ష పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ అంశంపైన ప్రజలు ఎన్నికల సమయంలో పోలింగ్ బహిష్కరించడం ద్వారా హెచ్చరించడం అవసరమన్నారు. పలువురు కవులు, రచయితల కృషిని, పుస్తక సంపాదకత్వ బాధ్యత వహించిన రచయిత బద్రి కూర్మారావు శ్రమను చలం అభినందించారు. ఈ రచనలను ఉద్దానంలోని ఏడు మండలాల ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలని అందుకోసం ఈనేలలో పనిచేస్తున్న ప్రజా సంఘాలు బాధ్యత వహించాలన్నారు. కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ సభకు అధ్యక్షత వహిస్తూ భవిష్యత్తు పోరాట కార్యాచరణకు ఈ సభ దోహదపడుతుందన్నారు. సాహితీ సాంస్కృతిక సంస్థలు సైతం కిడ్నీవ్యాధి శాశ్వత నిర్మూలన కోసం సాగే ప్రజల ఉమ్మడి పోరాటంలో భాగమవుతాయన్నారు. తొలుత కళింగసీమ సాహిత్య సంస్థ కార్యదర్శి బెందాళం కృష్ణారావు స్వాగతం పలికిన ఈ సభలో పుస్తక సంపాదకులు బద్రికూర్మారావు, పలువురు వైద్యులు డాక్టర్ ఎం. మల్లేశ్వరరావు, డాక్టర్ తెప్పల ఆనంద్, డాక్టర్ గొరకల గిరిబాబు, డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు, పలువురు రచయి తలు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కిడ్నీ వ్యాధి నివారణకు ప్రజలు చేపట్టవలసిన కర్తవ్యాలను తెలియజేశారు. పుస్తకాన్ని రచయిత బమ్మిడి సుబ్బారావు సమీక్షించారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వారికి, ఇటీవల మృతిచెందిన రచయితలు చీకటి కామేశ్వరరావు, బత్తిన ఓంకార్‌లకు నివాళిగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. కళింగసీమ సాహిత్య సంస్థ సహాయ కార్యదర్శి మామిడి కోదండరావు నిర్వహణలో సాగిన కవితాపఠనంలో వంకల రాజారావు, వావిలపల్లి రాజారావు, మార్పు నారాయణమూర్తి, శిష్టు మనోజ్ కుమార్, బోకర దుర్యోధనరావు, యస్.సోములయ్య, వినోద్ కుత్తుం, సాలిన జోగారావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో డీసీసీ అధ్యక్షులు అంబటి క్రిష్ణారావు సోమవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో గాధం వెంకట త్రినాథరావు, శేషగిరిరావు, డాక్టర్ జీవితేశ్వరరావు, తంగుడు వీర్రాజు, తెంబూరు మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.
- సత్యంన్యూస్, పలాస

## జాతీయ లావర్శిటీ అసోసియేట్‌గా అపర్ణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన కుమారి దుంపల అపర్ణ నేషనల్ లా యూనివర్సిటీలో రీసెర్చ్ అసిస్టెంట్ ఆఫ్ లా, దామోదర సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీలో అసోసియేట్ టీచర్‌గా ఎంపికైంది. బీసీ-ఏ కోటాలో ఉన్న ఒకే పోస్టును అపర్ణ దక్కించుకో వడంపై పలువురు అభినందించారు. తండ్రి శ్రీనివాసరావు బురిడీ కంచరంలో స్కూల్ అసిస్టెంట్‌గా తల్లి సుశీల బెజ్జిపురంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. అపర్ణ ప్రస్తుతం ఎంఎల్ పూర్తి చేసి పీహెచ్డీ చేస్తున్న సందర్భంలో అదే యూని వర్సిటీ కాలేజీలో టీచింగ్ ఫ్యాకల్టీగా ఎంపిక కావడం పొందూరు మండల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ టీచర్స్ ఫెడరే షన్ ప్రతినిధులు ఉద్యమాభి వందనలు తెలిపారు.


## అద్దెకొరకు

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22x150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300,
98487 96626


# 'వదిలేయడం' కుదరదు

మొదటిపేజీ తరువాయి

రూ.2 లక్షలు ఉంది. దీనికి తోడు ఎవరుపడితే వారు షాపు లైసెన్స్‌కు దరఖాస్తు చేయడం కుదరదు. ఆ మేరకు ఇన్‌కమ్ టాక్స్ కడుతున్నవారు, వైట్ మనీ బ్యాంకు బ్యాలెన్స్‌లో ఉన్నవారు మాత్రమే ఇందుకు అర్హులు. బుధవారంతో ముగిసిపోయే దరఖాస్తు గడువుకు జిల్లాలో 158 మద్యం దుకాణాలకు ఆదివారం వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో 503 దరఖాస్తులు వచ్చాయి. అదే 2017-19 పాలసీలో ఒక్క శ్రీకాకుళం టెరిటోరీలోనే అంటే.. ఏడు స్టేషన్ల పరిధిలో 3,300 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పలాస టెరిటోరీలో కూడా కాస్త అటుఇటుగా ఇంతే సంఖ్యలో దరఖాస్తులు పడ్డాయి. కారణం.. నాన్ రిఫండబుల్ ఫీజు రూరల్‌కు రూ.50వేలు, నగరానికి రూ.లక్ష చొప్పున ఉండేది. ఇప్పుడు అన్ని షాపులకు ఒకే లెక్కన రూ.2లక్షలు చేశారు. దీంతో ఒక్కొక్కరు గతంలో 25 అప్లికేషన్లు వేసినచోట ఈసారి 5 అప్లికేషన్లు వేయడం గగనమైపోతుంది. పోనీ 2019 నుంచి ఇప్పటి వరకు మద్యం వ్యాపారం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండి సంపాదించారా? అంటే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ అవకాశం బయటివారికి ఇవ్వలేదు. ఇప్పుడు ఆస్తుల మీద బ్యాంకు లోన్లు తెచ్చి, బంగారం కుదువ పెట్టి రూ.2లక్షలు రాదని తెలిసి దరఖాస్తు వేయడానికి అంత సుముఖత ఉండదు. దీన్నే తెలుగుదేశం పత్రికలు భూతద్దంలో చూపిస్తున్నాయి. గత వ్యాపారస్తులెవరూ ఇందులోకి రాకపోతే ఏకపక్షంగా తెలుగుదేశం నాయకులకే షాపులు ఉండిపోతాయన్న భావనలోనే ఈ కథనాలు వండి వారుస్తున్నట్టు వ్యాపారస్తులు భావిస్తున్నారు.

### ఎమ్మెల్యే వర్సెస్ దాసన్న

శ్రీకాకుళం జిల్లానే ఉదాహరణగా తీసుకుంటే నరసన్నపేట నియోజకవర్గంలో తప్ప మరెక్కడా దరఖాస్తులు బయటివారు వేయకూడదన్న సిగ్నల్స్ లేవు. నరసన్నపేటలో కూడా ఎమ్మెల్యే తనయుడు 18 షాపులకు వేస్తారని, పాతవారు రాకూడదన్న ఆదేశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. ఇది ఏమేరకు వాస్తవమో తెలియదుగాని ఆదివారం వరకు 2019 పాలసీ వరకు మద్యం వ్యాపారం చేసినవారెవరూ దరఖాస్తులు వేయలేదు. ఒకరిద్దరు ఆన్‌లైన్‌లో వేసినట్లు భోగట్టా. నరసన్నపేట టౌన్‌లో 8, పోలాకిలో 3, జలుమూరులో 3, సారవకోటలో 4 షాపులకు దరఖాస్తు చేయాల్సి ఉంది. ఒకప్పుడు జిల్లాలో లిక్కర్ సిండికేట్‌ను నరసన్నపేట నుంచే ఆపరేట్ చేసేవారు. పీలా జగ్గారావు గాని, ఈశ్వరరావు గాని నరసన్నపేట కేంద్రంగానే సిండికేట్ నడిపారు. అటువంటి చోట ఈసారి పాత వ్యాపారస్తులెవరూ దరఖాస్తు చేసుకోకూడదన్న ప్రచారంపై మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కూడా ధీటుగానే స్పందించినట్లు చెబుతున్నారు. ఆదివారం ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి తామూ దరఖాస్తులు వేస్తామని, ఇందులో తేడాలొస్తే బాగోదని చెప్పినట్లు తెలుస్తుంది.

### భయపెడుతున్న మండలం యూనిట్ నిబంధన

అన్నింటికంటే ముఖ్యంగా వేలంవెర్రిగా మొదటి రోజు నుంచే దరఖాస్తులు పోటెత్తకపోవడానికి ప్రధాన కారణం ఏ షాపునకు దరఖాస్తు చేయాలో తెలియకపోవడం. గతంలో ప్రతీ షాపునకు ఓ నెంబరు ఇచ్చి, ఆమేరకు దరఖాస్తులు తీసుకొని, అందులో డ్రా వేయడం ద్వారా వచ్చినవారికి ఆ షాపును కేటాయించేవారు. కానీ ప్రస్తుత పాలసీలో మండలం యూనిట్‌గా నిర్ణయించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీనికి ఉదాహరణ చెప్పాలంటే శ్రీకాకుళం నియోజకవర్గంలో గార మండలాన్నే తీసుకుంటే కళింగపట్నం, శ్రీకూర్మం, గార, ఒప్పంగి ప్రాంతాల్లో షాపులకు ఎక్కువ సేల్ ఉంటుంది. ఇప్పుడు లక్కీడ్రాలో ఎవరికైనా షాపు తగిలితే కళింగపట్నం, శ్రీకూర్మం, గార వంటి షాపులు కేటాయిస్తారన్న గ్యారెంటీ లేదు. గార మండలంలో ఏదో ఒక షాపు ఇవ్వొచ్చు. ఇటువంటి చోట రాజకీయ నాయకులకు ఎక్కువ సేల్ ఉన్న షాపులను కట్టబెడతారు. లైసెన్స్ ఫీజు మాత్రం వారికి, వీరికి సమానమే. అలాగే ఎచ్చెర్లలో కేకేనాయుడు పేట, కేశవరావుపేటలో ఎక్కువ సేల్ ఉంటుంది. అన్నింటికంటే తక్కువ ధర్మవరంలో వ్యాపారం జరుగుతుంది. ఇప్పుడు ఎచ్చెర్ల మండలం ఒక యూనిట్‌గా షాపు సంపాదించిన వ్యక్తికి మొదటి రెండు షాపులు కాకుండా ధర్మవరం షాపు కేటాయిస్తే అన్నీ మూసుకొని తీసుకోవాల్సిందే. శ్రీకాకుళం రూరల్‌లో రాగోలు, ఒప్పంగి, సింగుపురం, శిలగాం సింగువలసలో ఎక్కువ సేల్ ఉంటుంది. మండలం యూనిట్‌గా షాపు గెలుచుకున్న బయటివారికి ఇప్పిలి, కళ్లేపల్లి లాంటి తక్కువ సేల్ ఉన్న షాపులు కేటాయించవచ్చు. దీనికి భయపడుతున్న వ్యాపారస్తులు దరఖాస్తు చేసుకోడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు తప్ప ఎక్కడా మద్యం షాపులు మేమే చేసుకుంటాం, మీరు దరఖాస్తు చేయకండి అని చెప్పే పరిస్థితి లేదు. జిల్లాలో పైసా పెట్టుబడి లేకుండా రాజకీయ నాయకుల్లో ఎక్కువ శాతం మంది ఇసుక వ్యాపారం చేసుకుంటున్నారు. ఇప్పుడు మద్యంలో పెట్టుబడి పెట్టి ఓటరు దగ్గర చెడ్డయిపోవడం అనవసరం.

## వైకాపాలో వార్డుమెంబర్లు జీరో..

# వాలంటీర్లే హీరో!

- శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

వైకాపా హయాంలో వార్డు మెంబర్లను జీరోలను చేసి వాలంటీర్లను హీరోలుగా చూపించారని ఎమ్మెల్యే గొండు శంకర్ వ్యాఖ్యానించారు. ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆయన సోమవారం ప్రారంభించారు. గత పాలకులు, అధికారులు ఎప్పుడూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల భజనే చేశారన్నారు. దానికి ప్రతిఫలం ఇప్పుడు అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని గ్రామాన్ని కొంతైనా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ గొప్ప పథకమని, దీని ద్వారా గ్రామాలను బాగుచేసుకోడానికి ముందుకు రావాలన్నారు. స్థానిక సంస్థలకు మూడున్నరేళ్లు ఎలా గడిచిపోయాయో మర్చిపోయి రానున్న ఏడాదిన్నర కాలంపై దృష్టి సారించి అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తనకు పార్టీలతో సంబంధం లేదని, అభివృద్ధి ఒక్కటే తన అభిమతమన్నారు. వార్డు మెంబర్లుగా హక్కులు, బాధ్యతలు తెలుసుకొని గ్రామాభివృద్ధికి, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, మూకళ్ల శ్రీను, ఎండు చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జెడ్పీ సీఈవో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



జిల్లాపరిషత్ నూతన సీఈవోగా శ్రీధర రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం డీపీవోగా పని చేసిన శ్రీధరరాజు జెడ్పీ సీఈవోగా ఇక్కడకు వచ్చారు. కలెక్టర్ స్వప్నిల్‌దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

## విధుల్లో చేరిన డీపీవో


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జిల్లా పంచాయతీ అధికారిగా కె.భారతీ సౌజన్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల ప్రక్రియలో భాగంగా భారతీ సౌజన్య కాకినాడ జిల్లా పంచాయతీ అధికారిగా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కలెక్టర్ స్వప్నల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## పైడితల్లి ఉత్సవాలకు స్పీకర్‌కు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు హాజరు కావాలంటూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వానపత్రిక అందించారు. మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు ధర్మకర్తగా ఉన్న ఈ ఆలయ ఉత్సవాలకు వారి తరఫున ఓంబిర్లాకు అప్పలనాయుడు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగే సిరిమాను ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి అమ్మవారి భక్తులు వస్తారని, స్పీకర్ కూడా రావాలని పిలిచినట్లు కలిశెట్టి తెలిపారు.



దేవీ నవరాత్రుల్లో భాగంగా మొండేటివీధిలో వెలసిన లలితాదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం శతలింగార్చన, యంత్రప్రస్థారం, రుద్రాభిషేకంతో పాటు విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బాణలింగాలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కర్రా భాస్కరరావు దంపతులు, కొల్లి శిరీష, కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.